వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, అక్టోబర్ 24, 2026

గాంధీ భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- న్యాయవాదులకు ఇందిరమ్మ ప్రమాద బీమా..
- హెల్త్ ఇన్సూరెన్స్ రూ. 5 లక్షలకు పెంపు పరిశీలన: మంత్రులు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అధ్యక్షతన లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకట్ స్వామి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కి గౌడ్ మరియు పలువురు ముఖ్య నేతలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన న్యాయవాదులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులందరికీ వర్తించేలా 'ఇందిరమ్మ ప్రమాద బీమా' అమలు చేస్తామని, హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ. 2 లక్షల నుండి రూ. 5 లక్షలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. న్యాయవాదుల భద్రత కోసం అసెంబ్లీలో 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. జీపీ, ఏజీపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మరియు స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుల భర్తీపై సీఎం కసరత్తు చేస్తున్నారని, పనితీరు ఆధారంగా నియామకాలు ఉంటాయని వెల్లడించారు. నవంబర్ 1న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల సమక్షంలో ఢిల్లీలో జరిగే భారీ కార్యక్రమానికి తెలంగాణ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ వచ్చే వారికి ప్రయాణ, వసతి ఏర్పాట్లు చూసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ సాధనలోనూ, 2023లో ప్రజా పాలన ప్రభుత్వం రావడంలోనూ న్యాయవాదుల పాత్ర మరువలేనిదని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. పార్టీ కోసం కష్టపడిన అడ్వకేట్లకు సముచిత న్యాయం చేస్తామన్నారు. 33 జిల్లాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో లీగల్ సెల్ ప్రతినిధులు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యకర్తలకు న్యాయపరమైన అండగా నిలవాలని సూచించారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో కీలక నిర్ణయాలు కోర్టు తీర్పుల ద్వారానే వస్తున్నందున లాయర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో లాయర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తే ప్రతి జిల్లా కేంద్రంలోనూ అడ్వకేట్లకు పోస్టులు లభించే అవకాశం ఉంటుందన్నారు. పార్టీ కోసం శ్రమించిన వారికి కేబినెట్‌లో చర్చించి తగిన పదవులు దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తోటి న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించడానికి న్యాయవాదులంతా ఐక్యంగా కృషి చేయాలని, ప్రచారంలో ముందంజలో ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు.

జూబ్లీహిల్స్ - ఎన్ఎఫ్‌సిఎల్ ఎలివేటెడ్ కారిడార్ పనులపై జీహెచ్ఎంసీ దృష్టి

- 4.3 కిలోమీటర్ల మేర సిగ్నల్-రహిత ట్రాఫిక్ కారిడార్ ప్రాజెక్ట్‌పై కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్ష
- కేబీఆర్ పార్క్ చుట్టూ జంక్షన్ల అభివృద్ధితో పాటు యుటిలిటీల తరలింపు వేగవంతం చేయాలని ఆదేశం

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హైదరాబాద్ నగరంలో అత్యంత కీలకమైన జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుండి ఎన్ఎఫ్‌సిఎల్ జంక్షన్ వరకు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ రంగం సిద్ధం చేస్తోంది. ఈ మార్గంలో సిగ్నల్-రహిత ట్రాఫిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రూపొందించిన 4.3 కిలోమీటర్ల సుదీర్ఘ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ పురోగతిపై జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీ ఆర్. వి. కర్ణన్ సీనియర్ అధికారులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్ట్ పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించేందుకు కేబీఆర్ పార్క్ ప్రధాన ప్రవేశ ద్వారం, అగర్సేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద చేపట్టాల్సిన జంక్షన్ అప్‌గ్రేడేషన్ పనులను వేగవంతం చేయాలి. కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్, ఇతర యుటిలిటీ వైర్లను, స్తంభాలను త్వరితగతిన తరలించడానికి టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులతో తక్షణమే సమన్వయం చేసుకోవాలి. ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సిఎల్ జంక్షన్ వరకు ఉన్న ప్రధాన మార్గంలో ఫౌండేషన్ డిజైన్‌కు సంబంధించిన జియోటెక్నికల్ పరిశోధన పనులను వేగంగా పూర్తి చేయాలి. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మరియు ముగ్ధ జంక్షన్ మధ్య ఫౌండేషన్ తవ్వకాలను, అలాగే ఆఫ్-సైట్ స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులను వేగవంతం చేసి పనుల్లో పురోగతి చూపాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.



న్యూ శాయంపేటలో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

- అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి
- సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పట్టభద్రుల ఉక్కు పిడికిలి

న్యూ శాయంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకునేలా చూడడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముమ్మరంగా రంగంలోకి దిగాయి. శనివారం ఉదయం న్యూ శాయంపేట 31వ డివిజన్ (బ్లాక్-1) పరిధిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ తిరుగుతూ పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హత ఉన్న ఏ ఒక్క పట్టభద్రుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. ఓటరు నమోదుకు కావలసిన దరఖాస్తు విధానం, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని ఓటర్లకు వివరించారు.



- కాంగ్రెస్ అభివృద్ధిపైనే పట్టభద్రుల చూపు:

ఈ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు, పట్టభద్రులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా పట్టభద్రులంతా ఉక్కు పిడికిలి బిగించారని, ప్రచారంలో ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జ్ మార్క విజయ్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, డివిజన్ ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జ్ మామిండ్ల సురేష్‌తో పాటు ఎనబోతుల సతీష్, గాడిపెల్లి ధర్మేందర్, వెనుకంటి రాకేష్, మామిండ్ల రమేష్, పొనుగుంటి ప్రవీణ్, ఆరెళ్ల అభిలాష్, మామిడాల సంతోష్, మాచర్ల అనిల్ తదితర కాంగ్రెస్ నాయకులు, యూత్ లీడర్లు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా సంగారెడ్డి సాయిబాబా ఆలయ రజతోత్సవాలు

- కన్నుల పండువగా శిఖర కుంభాభిషేకం..
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో వెలసిన శ్రీ సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో, ప్రముఖ నేతలు జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో దాదాపు 30 మంది వేద పండితులు ఈ రజతోత్సవ క్రతువులను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. మూడు రోజుల పాటు సాగిన ఈ వేడుకల్లో... మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మరియు మూడో రోజు శిఖర కుంభాభిషేక కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ పూజలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. రజతోత్సవాల ముగింపు రోజైన మూడో రోజు నిర్వహించిన శిఖర కుంభాభిషేకంలో కాంగ్రెస్ నాయకురాలు నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. బాబా కృపతో సంగారెడ్డి పట్టణం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్యులు టి.కాశప్ప, కే.వి.నర్సయ్య, ఎస్.వీరేందర్, ప్రభాకర్ రెడ్డి తదితరులతో పాటు భక్తులు పాల్గొని బాబా తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గడపగడపకూ వెళ్లి ఓటరు నమోదు చేయించాలి

- ఓటరు నమోదు ప్రక్రియలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది కావాలి
- తక్కెళ్లపల్లి రవీందర్ రావు



వైరా, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి బీఆర్ఎస్ శ్రేణులు పునాది వేయాలని ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమాయత్తంలో భాగంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై సమగ్ర సమీక్ష (రివ్యూ) నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటరు నమోదును మరింత వేగవంతంగా, మెరుగ్గా చేపట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు మరియు వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ రవీందర్ రావు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హులైన పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పట్టభద్రులకు వివరించి, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్జేసి కృష్ణ, సీనియర్ నాయకులు వెంకటరమణలతో పాటు పలువురు మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.